ఓసారి నా ఎస్.ఐ. మిత్రుడు మాయింటికొచ్చాడు. వాడూ నేనూ చిన్నప్పట్నించీ క్లాసుమేట్సుం. ఇద్దరూ ఒక ఊరి వాళ్లమయినా ఉద్యోగరీత్యా వేరు వేరు ఊళ్లలో ఉండవలసి వచ్చింది. అయితే ప్రక్క-ప్రక్క ఊళ్లో ఉండటం వల్ల అప్పుడప్పుడు కలుసుకుంటూ ఉంటాం.

ఆరోజు మావూరి పోలీసు స్టేషన్లో ఏదో పని నిమిత్తం వచ్చి మా ఇంటికొచ్చాడు. చాలాసేపు కబుర్లు



# బాధ్యత

**–కట్టా రాంబాబు**

చెప్పుకున్నాం. భోజనం చేసాక వాళ్లూరికి రమ్మంటూ కూర్చున్నాడు. నేనూ వెళ్లి చాలా కాలమయిందేమో ఓసారి వెళ్లొద్దామనిపించి బయలుదేరాను.

ఇద్దరం బస్టాండు కొచ్చాం. వాడి బుల్లెట్ని సి.ఐ. పట్టుకెళ్లాడట. నా స్కూటరు రిపేరుకెళ్లింది. ఇంక బస్సులో వెళ్లక తప్పదు. బస్సొచ్చింది. అంత రష్గా లేదు. ఎక్కి కూర్చున్నాం. డ్రైవరు, కండక్టర్లు టీ తాగటానికి వెళ్లారు.

బస్సంతా చాలా గలీజుగా ఉంది. సీట్లలో దుమ్ము పేరుకు పోయి ఉంది. క్రిందంతా మట్టి మట్టిగా ఉంది. కూరగాయల లగేజీని దింపినట్టున్నారు. వాటి తాలూకు అవశేషాలున్నాయి. అక్కడక్కడా సిగరెట్ పీకలు. మొత్తం మీద మున్సిపాలిటీ వాళ్లు సమ్మె చేస్తే రోడ్ల పరిస్థితిలా ఉంది.

అసలా బస్సులో కూర్చోవాలని పించలేదు. కాని ఈ బస్సుపోతే మళ్లీ రెండు, మూడు గంటల వరకు లేదు. తప్పనిసరిగా ఇందులోనే పోవాలి.

''డర్టీ ఫెలోస్! ఆ కండక్టర్, డ్రైవర్లకి బుద్ధున్నట్టు లేదు. బస్సునిలాగేనా ఉంచేది. బయలుదేరేముందు క్లీన్ చేయించొద్దూ. రానియ్యి వాళ్లని జాడించేస్తాను. కంప్లయింట్ బుక్లో రాస్తేగాని వాళ్ల తిక్క కుదరదు'' అంటూ మండిపడ్డాడు నా ఎస్సై మిత్రుడు.

నిజమే. బస్సుని పరిశుభ్రంగా ఉంచడం అందరి కర్తవ్యం.

కొంత బాధ్యత కండక్టర్, డ్రైవర్ల మీద ఉంది. బయలు దేరే ముందు బస్సుని శుభ్రం చేయించాల్సిన బాధ్యత ఆర్టీసీ వాళ్ల మీద ఉంది. బస్సులో మట్టి పేరుకు పోయిందంటే ఈమధ్య వర్షాలు కూడా ఏం లేవు. ఎప్పటినుంచో శుభ్రం చేయని కారణంగా అలా పేరిగిపోతూ వచ్చింది.

అంతలో డ్రైవరు, కండక్టరు వచ్చి బస్సెక్కారు. బస్ స్టార్టయ్యింది. కండక్టరు వెనక్కి వెళ్లి టికెట్స్ కొడుతున్నాడు. అతను మా దగ్గరకు వచ్చినపుడు వాడ్ని పట్టుకుని చడామడా తిట్టేసాడు నా మిత్రుడు. ''ఏమయ్యా ఇది బస్సేనా లేక మున్సిపాల్టీ రోడ్డా. ఇలాగేనా ఉంచేది. మీ ఇంటిని ఇలాగే ఉంచుకుంటారా. బస్సు క్లీన్ చేయించాలని తెలీదా. బాధ్యత లేకుండా పోతుందసలు''.

''మమ్మల్నేం చేయమంటారు సార్. సరిగ్గా బస్సు



బయలుదేరే టైముకి ఒస్సేస్తారు. క్లీన్ చేయించడానికి మనుషులుండరు. ఇంక మేమే క్లీన్ చేసుకోవాలి మరి'' అన్నాడు కండక్టర్ కొంచెం గట్టిగా.

''ఏంటయ్యా అంత గట్టిగా మాట్లాడుతున్నావు. కంప్లయింట్ చెయ్యమంటావా. కంప్లయింట్ బుక్కు ఇలా ఇవ్వు రాసిపారేస్తాను. ప్రవాళ్లు రెస్పాన్సిబిలిటీ లేకుండా తయారవుతున్నారు''

ముందు నుంచి డ్రైవరు అందుకున్నాడు ''ఏం చెయ్యమంటారండి! బస్సు నీట్‌గా లేకపోతే మేమా బాధ్యులం. నీట్‌గా ఉంచుకోవాలని పాసెంజర్లకి తెలీదా. అంతా మమ్మల్నే అంటారు. రాసుకోండి ఏం రాసుకుంటారో''.

విషయం ముదిరిపోయేలా ఉంది. కంప్లయింట్ బుక్‌లో రిపోర్టు రాస్తే కండక్టరు ఉద్యోగానికి ఏం ముప్పు లేకపోయినా అనవసరంగా అతని డ్యూటీలో రిమార్కు ఉంటుంది. నాలాగా చాలామంది ఆలోచించి నట్టున్నారు మా ఎస్సై మిత్రుడికి సర్ది చెప్పారు.

''ఛీ! ఛీ! అంతా అలా అంటే చేస్తుంటారు కాబట్టే దేశం ఇలా తగలడుతోంది'' అంటూ గొణుక్కున్నాడు.

మేం దిగవలసిన స్టేజి రావడంతో దిగిపోయాం.

ఇల్లు దగ్గరే కావడంతో నడిచే బయలుదేరాం.

''ఓసారి స్టేషన్ కెళదాం రా. ఉదయం నుంచీ సి.ఐ. కూడా లేడేమో మా వాళ్లంతా ఏం చేస్తున్నారో మరి. అట్నుంచటే ఇంటికి పోదాం'' అంటూ స్టేషన్ వైపు తిరిగాడు. ఇద్దరం స్టేషన్‌కి నడిచాం.

పోలీసు స్టేషను ఓ పురాతన భవనంలో ఉంది. చుట్టూ తుమ్మ చెట్లు, రేగి కంపలతో నిండి ఉంది. స్టేషను ముందున్న పూలమొక్కలన్నీ వాడిపోయి కొన్ని, చచ్చిపోయి కొన్ని ఉన్నాయి. కాంపౌండంతా చెత్తా చెదారంతో నిండి ఉంది. స్టేషన్ అరుగు మీద రెండు బల్లలుంటే ఓ దానిమీద కానిస్టేబుల్ పడుకుని ఉన్నాడు. మమ్మల్ని చూసి ఉలిక్కిపడి లేచాడు. అరుగునిండా సిగరెట్టు పీకలు. ఓ మూలన ఎప్పుడో తాగినట్టున్న నాలుగు టీగ్లాసు లున్నాయి.

ఇద్దరం లోపలికి నడిచాం. లోపలి గదిలో ఓ టేబులుంది. నాలుగు కుర్చీలున్నాయి. అయితే అవి ఉండవలసిన స్థానంలో లేకుండా ఎవరి కిష్టమొచ్చినట్టు వాళ్లు లాక్కుని కూర్చున్నట్టుగా ఉన్నాయి. రెండు బీరువా లున్నాయి. మకిలి మకిలిగా ఉన్నాయి. గది నిండా సాలెగూళ్లు. ఇంతకు మునుపు చూసిన ఆర్టీసి బస్‌కంటే అధ్వాన్నంగా ఉందా స్టేషను. కండక్టరుకు బాధ్యత లేదా అని దబాయించిన మా మిత్రుడికి తన స్టేషన్ని నీట్‌గా ఉంచుకోవలసిన బాధ్యత లేదా అనిపించింది.

అదే అడిగాను. నవ్వి అన్నాడు ''నా కెక్కడ కుదురుతుందిరా. రోజూ బిజీ. సరిగ్గా తినడానికి, నిద్రపోవడానికి తీరిక ఉండదు. ఇంక ఇవన్నీ చూడటానికి వీలవుతుందా. అయినా ఈ స్టేషనేమన్నా మన సొంతమా ఈ వేళ ఇక్కడుంటాం రేపింకో స్టేషన్లో ఉంటాం''.

మరి ఆ బస్సు కూడా కండక్టరు స్వంతం కాదు కదా అని అడుగుదామని అనుకున్నాను. కాని అనవసరం. అందుకే ఇంకా విషయం గురించి చర్చించ దలుచుకోలేదు.

అప్పుడు నాకనిపించింది. బాధ్యత అనేది ఇతరులకు గుర్తు చెయ్యడానికే గాని ఆచరించడానికి కాదేమోనని.